గుర్రపుకళ్లెం

అతను గుర్రాజు. అతనికి మీసాలున్నాయి. ఒకప్పుడు ఆ మీసాలు నిమ్మకాయలను నిలబెట్టేవట. ఆ ఒకప్పుడు....... గుర్రాజు కుర్రాడు. చుట్టు చెంగావి పంచె కట్టేవాడు. పేడకాసు రంగు సిల్కుచొక్కా వేసేవాడు. జరీ అంచు కండువా భుజంమీద ఉండేది. ఆరడుగుల మీద పొడవు. పొడవుకుతగ్గ లావు. చూసేవాళ్ళను గుమ్మెక్కిస్తూవుండేవాడట. 'కల్లావోరి ఆమ్మి ఆ పెరటి గుమ్మం పట్టుకుని వదిలేదేకాదుట!' 'కల్లావోరంటే సిన్నకులపోళ్ళేంగాదు'

ఈనాడూ అతను గుర్రాజే. పొడవు ఆరడుగులే. ఉన్నవి ఆ మీసాలే. అప్పటికీ, యిప్పటికీ ఉన్నది ఆ గుర్రపు కళ్ళెమే.

గుర్రపు కళ్ళానికీ, గుర్రాజుకీవున్న సంబంధం ఏమిటి? ఆ ప్రశ్నకు జవాబు వెతకాలంటే అతని చిన్నతనంలోకి పోకతప్పదు. కొత్తగా కొన్న మైసూరు గిత్తలకు దాణా సరిగ్గా వేస్తున్నారో లేదో ఆరా తీస్తున్నాడు తండ్రి. మరిడియ్య వీపు మీద ఎక్కి ఆడుతున్నాడు 'సిన్నబాబుగోరు' గుర్రాజు.

"మన గొప్పతనం చాలా గొప్పది. మనని జనం దివాణాలు అనే పిలుస్తారు. మనం ఎక్కాల్సింది గుర్రాలని. మనం తియ్యాల్సింది ఆడాళ్ళని. మనం మెలెయ్యాల్సింది మీసాలని. అప్పుడే మన కులం పేరూ యింటిపేరూ నిలుస్తుంది" - యిదీ గుర్రాజు తండ్రి చేసిన బోధన.

బాల గుర్రాజు కుర్ర గుర్రాజు అయ్యాడు. తండ్రి పోయేరోజుల్లో కూడా - 'బాబా! నీ ముత్తాతదివాణంలో సంపాయించిన గవురవం ఆ గుర్రం కళ్ళెంలో వుంది. నీ తాతా నేనూ దానికి తగిన గుర్రం కొనలేకపోయాం! నువ్వయినా ఆ పని చెయ్యాలి!' అనేవాడు. చివరి చూపులో కూడా అతను "పెద్దోడివి! పేరు నిలపాల్సినోడివి! మనం దివాణాలం! గుర్రాలు! ఆడాళ్ళు! మీసాలు!" అంటున్నట్టుండేది గుర్రాజుకి.

గుర్రాజు పేరు నిలబెట్టడానికి చెయ్యగలిగినదంతా చేసాడు. గుర్రాన్ని కొన్నాడు. ఆళ్ళను తీసాడు. మీసాల్ని మెలేసాడు. తండ్రి మాటలను గుర్తు

చేసుకొంటూ తిరిగాడు. అతనోమారు గుర్రం ఎక్కి సింహాద్రిపురం వెళ్తే ఆ వూరి షావుకారు అన్నాట్ట - "పెద్దకాపుగోరూ! మంచి గుర్రాన్ని కొన్నారే!" మీసంమెలేస్తూ అతనందించిన లెక్క జేబులో దోపుకొంటుంటే అన్నాట్ట- "అయితేనేం లెండి! తమరి గుర్రాలు ఆకలంటాయి! అలసిపోతాయి! ముసిలవుతాయి! మూల బడతాయి! మా గుర్రాలకి అలాంటి బాధలేం వుండవు........" అర్థంకాని గుర్రాజు గుంభనంగా నవ్వేసి గుర్రం ఎక్కి వెళ్ళిపోయాక పక్కనున్న పాపయ్యశాస్త్రి అర్థంకాని మరో ఆసామీకి అందించాట్ట - "ఏటుందండి! షావుకార్ల గుర్రాలు చక్రవడ్డీలండి!"

అతనికి ఓ తమ్ముడున్నాడు. అన్నగారి పెత్తనం మీదా వ్యవహార్తతనం మీదా అతనికి అనుమానాలేం వుండేవికావు. కట్నానికి లోబడి అతనికి 'చెడి బతికినోళ్ళ' పిల్లని కట్టారు. గుర్రాజుకి ఆ సంబంధం అంతగా నచ్చలేదు. తమ్ముడి క్షేమంగూర్చి నచ్చజెప్పుకొని ఒప్పుకున్నాడు. వచ్చినామె జాగ్రత్తమంతురాలు. వస్తూనే ఆ కుటుంబంలోని లోతుపాతులన్నీ పట్టేసింది-మా కుటుంబం అంతదీ యింతదీ అంటూ చెప్పే గొప్పలనీ, తనని చూసే చిన్నచూపునీ ఆమె భరించలేకపోయింది భర్త లొంగివచ్చేదాకా నోరు మెదపలేదు. నోరు మెదిపాక ఊరుకోలేదు. వేరు పెట్టించింది. కొన్నాళ్ళు కుండలు వేరయాయి. ఆ తర్వాత వ్యవసాయాలు వేరయాయి.

తమ్ముడితో విడిపోయాక గుర్రాజు పుచ్చులు ఒకటి ఒకటే పయికి వచ్చాయి. అతని భార్య నాలుగు బళ్ళతో సారి తెచ్చుకుందిట. ఆమెకి కూడా భర్తచేసే ఖర్చూ అతని పద్ధతీ అంతగా నచ్చేవికావు. అయితే ఆమె కన్నవారిది కూడా అలాంటి కుటుంబమే. వాళ్ళుకూడా ఆడవాళ్ళను ఆర్థిక విషయాలలో సంప్రదించేవారుకారు. ఆమె తెలివితేటలుకూడా అంతతమాత్రం. దానాదీనా ఆమె భర్తను సరైన మార్గంలో పెట్టలేకపోయింది. భర్త ఒక్కో ఆడదాన్ని తీసినపుడు మాత్రం ఆమె గొంతుక్కి అడ్డూ ఆపూ ఉండేదికాదు. కొన్నాళ్ళు ఆ గొంతు గుర్రాజు పరోక్షంలోనే ఉండేది. తర్వాతర్వాత అది ప్రత్యక్షంగానే సాగేది. గుర్రాజు నోరు ఎత్తేవాడుకాదు. తన పద్ధతి మార్చుకునేవాడూకాదు.

చక్రవడ్డీల చక్రబంధంలో గుర్రాజు కీర్తిపతాక ఎగరటానికి అతని ఆస్తి చిక్కుకుంది. అప్పులన్నీ తీర్చేసి మిగిలిన రెండు ఎకరాల భూమితోటీ ఊరిమీదపడి తిరుగుతున్న అయిదు గుర్రాల (పిల్లల్తో కలిసి) తోటీ, గుర్రాల్లా ఎదిగి పెళ్ళికోసం చూస్తున్న యిద్దరూ, ఎదుగుతున్న ఇద్దరు ఆడపిల్లలూ, ఒకే ఒక కొడుకుతోటీ.... ఊరికి అటొకటీ యిటొకటీ యిద్దరు ఆడవాళ్ళతో.... వాళ్ళ పిల్లల్తో మిగిలాడు గుర్రాజు.

ఆ యిద్దరిలో ఒకామె నల్లగా వుంటుంది. సన్నగా ఉంటుంది. కాల్చిన తాటిమట్టలా వుంటుంది. గుర్రాజు బాగా వెలుగుతున్న చివరిరోజుల్లో ఆమె

ప్రవేశించింది. ఆమె అరుపులు పెళ్ళాం అరుపుల నుంచి గుర్రాజుని రక్షించేవి రెండురోజులకు ఓమారు ఆమె ఊరునీ వాడనీ ఏకం చేస్తుంటుంది - "నాకు ఏటి ఎట్టాడని ఆడిని పట్టుకుని ఏడాల? యిశవోసం గలదాన్ని గనక యిడిసిపెట్టలేక పోతున్నాను" అంటుంటుంది. నిజానికి ఆమె గుర్రాజు ఎండిపోకముందే రావటంవల్ల, పిల్చదలుచుకున్నది పిల్చలేకపోయినా పిల్చగలిగినది బాగానే పిల్చింది. ఆ తర్వాత గుర్రాజు ఎండిపోయినా ఆమె కూడా ఎండిపోవటంవల్ల - "ఇంక తీసేవాడెవడూ లేకపోవడం వల్లో ఏమో!" అతనితో ఉండిపోయింది. ఆమె ఊరికి దక్షిణాన ఉంటోంది. ఆమెకో చిన్న పెంకుటిల్లు కూడా ఉంది.

ఉత్తరాన ఉన్న ఆమె గుర్రాజు తీసిన ఆఖరు స్త్రీ. ఒళ్ళుగా ఉంటుంది. ఆమెకు ఓ కాలు బోదకాలు. ఉత్తరాన శ్మశానం ఉంటుందంటారు గుర్రాజుకి మాత్రం మిగిలిన శాంతి అవైపే వుంది. శనివారం తెల్లారగట్లే లేచి కాలవకు పోయి స్నానం చేసి పచ్చగా పసుపురాసుకుని పెద్దబొట్టు పెట్టుకుంటూంది పార్వతి. గుర్రాజు ఆమెకు యిచ్చినది చెప్పుకోదగిందేంలేదు. ఆమె ఉంటున్న తాటాకుఇల్లు కూడా ఆమె కష్టపడి కట్టుకున్నదే. ఆ జాగా మాత్రం గుర్రాజు ఇచ్చాడు. అరుపులతోటీ నమ్మకద్రోహంతోనూ నిండిన గుర్రాజు ప్రపంచంలో ఆమె మెత్తనయిన స్వభావం ఓ శాంతి. ఆమె యింటికి మంచినీటి చెరువు దూరం. స్థూలకాయం కావటంవల్ల ఆమె నీళ్ళు తెచ్చుకోటానికి ఆయాసపడేది. కావిడ వేసుకుని గుర్రాజు నీళ్ళు తెచ్చేవాడు. ఆమెకో కుర్రాడు ఉన్నాడు ఆరేళ్ళ ఆ కుర్రాడంటే గుర్రాజుకి ఎనలేని వాత్సల్యం. సాయంకాలమయేసరికి యింటినీ, యింటి ముందు వాకిలినీ, తుడిచి నులక మంచం వాల్చి ఉంచుతుంది. ఆరేసిన బట్టలు కట్టుకొంటుంది. ఆ కమ్మలింటి రాటను ఆనుకొని కూర్చుంటుంది. అతను వచ్చి వాకిట్లో మంచంమీద కూర్చుంటాడు. చుట్టకాలుస్తూ అపుడూ అపుడూ ఏదో చెపుతుంటాడు. ఒక్కోమారు ఏం మాట్లాడకుండానే గడిచిపోతుంది. కుర్రాడు ఆడుకువచ్చి అతని గుండెలమీద పడుకుని నిద్రలోకి జారుకుంటాడు. ఏ రాత్రివేళో అతను లేచి యింటికి వెళ్లిపోతాడు. అప్పుడు ఆమె లేచివచ్చి ఆ మంచం లోపలికి తీసుకుపోతుంది. దైహిక సంబంధం నామమాత్రంగానే వుండే ఆ యిద్దరికీ ఆ పద్ధతికి భంగం వచ్చిన రోజు ఏదో వెలితిగా వుంటుంది. ఆ కుర్రాడిని స్వయంగా స్నానం చేయించేవాడు. వాడికోసం పులుసూ పచ్చడీ సంపాదించేవాడు.

గుర్రాజు ఆర్థికత మీద చివరి దెబ్బలు కొట్టిన ఖ్యాతి బ్రాకెట్ ఆటకి దక్కింది.

ఆ రోజు - పార్వతి కొడుక్కి రాత్రికి రాత్రి జ్వరం వచ్చేసింది. పగలు పదకొండు గంటలకి గుర్రాజుకి కబురు అందింది. పరుగుపరుగున వెళ్ళాడు. మూసినకన్ను తెరవటంలేదు కుర్రాడు. ఊళ్ళో వైద్యుడు లేడు. కయితం

తీసుకెళ్ళాలి బండి కావాలి. తమ్ముడి దగ్గరకు పరుగెత్తాడు. అతను కాదనలేదు. పెట్టె బండిలో గడ్డి వేసి సర్దాడు. ఎడ్లు పూన్చుతున్నాడు. మొగుడిని వెంటబెట్టుకు వచ్చింది మరదలు.

"-అడ్డమయినవాళ్ళకీ బండి ఇవ్వటానికి నా నొప్పుకోను" అంటూ మొగుడిని ఓ దులుపు దులిపేసింది. తెల్లబోయి తమ్ముడి మొహంలోకి చూశాడు.

"ఏరా! తోలుకెళ్ళమంటావా?"

"నీకయినా వదినా పిల్లలకయినా అయితే అది ఏటీ అనదన్నయ్యా!"

ఒకప్పుడు గుర్రాజు మరదల్ని వేళాకోళం చేసాడు. "కులవూ(వర్ణవూ(అన్నారు: నలుగుర్ని పోషించే సత్తావున్నావోళ్ళం! గొప్పింటివాళ్ళకే గొప్పబుద్ధులుంటాయిగానీ....." దాన్నే మరదలు యీరోజు తిప్పికొట్టింది.

"ఒక్కళ్ళని కూడా పోషించే సత్తా లేనోళ్ళం మనం! లేనింటిదానికి లేని బుద్ధులు రాకేమవుతాయి?"

కొరడా అక్కడే పడేసి గుర్రాజు కయితంవేపు నడిచాడు డాక్టర్ని తీసుకురావటానికి.

ఏటిలో నీరు అంతగా లేదు. వున్న కొద్దినీరు ఓవారగా పాయలా ప్రవహిస్తోంది. చిన్నప్పుడు ఆడుకున్న ఏరూ ఉంది. ఊరూ ఉంది. అయితే ఎన్నిమార్పులు! సగం పైగా మామిడి తోట కొట్టేసారు. ట్రాక్టర్లొచ్చాయి. బోరింగులు వచ్చాయి. పది కాళ్ళ ఎడ్లూ పది అరకలూ ఉంటే గొప్ప రైతు అనుకునే రోజులు పోయాయి. ఒకడి సాయం ఒకడికి అవసరం లేకుండాపోయింది. యీరోజు తమ్ముడు ఆ మాట అనగలిగాడంటే....!

ఊరు ఆపాటి దూరాన కనిపిస్తోంది. మధ్యాహ్నం ఎండకీ గాడుపుకీ సుడిరేగి ఆకులూ చెత్తా ఎగురుతున్నాయి.

"అయినా వాడి తప్పేముంది....! నా పెళ్ళాంబిడ్డలకి సాయంరాకపోతే తప్పవుతుందిగాని...! అంత శక్తి లేనివాడికి ముండలు దేనికి....? ఏదయినా చేస్తే నేను చెయ్యాలిగాని... యింకోడిని అడగటం.... కాదనిపించుకోటం.....!" తమ్ముడి ప్రవర్తనని సరిపుచ్చుకుంటూ కయితంలో ప్రవేశించాడు.

వైద్యుడి యింటివైపు కదిలాడు.

అప్పుడే అరగంటక్రితమే వెళ్ళిపోయాడన్నారు. చీకటిపడిందాకా వుండిపోయాడు గుర్రాజు అతనికోసం. "అనవసరం కంగారేగాని ఏం జ్వరంలే!" అని సరిపుచ్చుకుంటూ కూర్చున్నాడు. పొద్దుటే వస్తే దొరుకుతాడు! యీ చీకట్లో వస్తాడో రాడో!- అనుకున్నాడు.

డాక్టరు వచ్చాక కబురు చెప్పమని తిరుగుముఖం పట్టాడు.

పురం చేరేసరికి తొమ్మిది. చెరువు గట్టుమీంచి చెక్క భజనలు వినిపిస్తున్నాయి. ఊరంతా అప్పుడే నిద్రలోకి జారుకుంది.

గుర్రాజు కాళ్ళు కదుల్తున్నాయి గాని మనసు కదలనంటోంది. ఏదో కీడు శంకిస్తోంది. చుట్ట ముట్టించుకోటానికి సింహాచలం కొట్లో దూరాడు. జోగుతున్న సింహాచలం - అలికిడికి లేచి - మనిషిని గుర్తుపట్టగానే వార్త చెప్పాడు.

గుర్రాజు చుట్ట జారిపోయింది.

ఆ వార్త వినబుద్ధి కాలేదు, నమ్మబుద్ధి కాలేదు. వినకా నమ్మకా చేసేది లేకపోయింది. పార్వతి వుండే ఇంటివైపు సాగిపోయాయి కాళ్ళు.

గుర్రాజు పార్వతి యిల్లు చేరుకున్నాడు. గుమ్మంలో చిన్నదీపం వుంది. పిల్ల పారబోసిన పాలు తొరకగట్టిన ధారలా పార్వతి నేలమీద తెల్లని చీరలో పడుంది. ఆ కాంతికి అడ్డు వస్తున్న రాట నీడ ఆమెమీద వాలిన భూతంలావుంది. దగ్గరగా వెళ్లికూర్చున్నాడు గుర్రాజు. ఏడిచి ఏడిచి నిద్రపోయింది కాబోలు - ఆపుకుంటున్న ఏడుపు ఆవరించిందతనికి. మగవాడయుండీ గొప్పవాడయుండీ ఏడుస్తున్నానన్న యింగితమే అతనికి కలగలేదు. పార్వతి మేలుకొంది. గుర్రాజు సంబాలించుకోగలిగినా, ఆమె ఆపుకోలేకపోయింది. ఆ ఏడుపుకి చుట్టుపక్కల వాళ్ళు పోగయిపోయారు. కొంతసేపు ఎవరికి తోచిన వేదాంతం వాళ్ళు చెప్పి వెళ్ళిపోయారు. కొంతసేపటికి ఆమె మగతగా కళ్ళు మూసుకుంది. గుర్రాజు చుట్ట వెలిగించుకుని కూర్చున్నాడు.

"బాబా! బాబా!" అంటూ అతన్ని కుదిపారు. చట్టున కళ్ళు తెరిచాడు-కొడుకు!

అతను చెప్పినది వింటూనే ఇంటివయిపు పరుగెత్తాడు. భార్య గొంతు పెద్దదిచేసి మొదలెట్టింది. ఓ మూల కూతురు ఏడుస్తోంది.

"ఎద్దులా గెదిగిపోయుంటే ఎవుడయినా అంటాడు. ఆడి జిమ్మడిపోనూ! నీ కులవేఁటి? బలవేఁటి?" గుర్రాజుకీ మొదలూ తుదీ అర్థంకాలేదు. అంతకన్న గొంతు పెంచాకే ఆమె అసలు విషయం చెప్పింది.

-ఆ వూళ్ళో ఓ పెద్దమనిషున్నాడు. అతనీ మధ్యనే సమితిదాకా ఎదిగాడు పరిషత్తుకు యెదిగే ప్రయత్నాలలో వున్నాడు. అతని కళ్ళని 'దుష్టకళ్లు' అంటూంటారు. అవి ఆడవాళ్ళ బట్టలు చేతుల్తో విప్పకుండానే విప్పగలవు. అందువల్ల అతనికి ఎదురుపడటానికి యిష్టపడరు ఆడవాళ్ళు. గుర్రాజు కులం కన్న అతని కులం కూస్తంత తక్కువ. సాధారణంగా పెద్ద లోగిలివాళ్ళు వీధుల్లోకి రారు. గుర్రాజు యింటి ఆడవాళ్ళు బయటకి రావాల్సివస్తోంది. వచ్చినా మిగిలిన వాళ్ళు భయపడినట్టు గుర్రాజు పెద్దకూతురు పూర్తిగా భయపడలేకపోయింది. ఎక్కడ ఏది ఎలా ఎంత ఎదగాలో అక్కడ అది అలా అంత ఎదిగేసిన ఆ పిల్ల ఆ 'దుష్టకళ్ళ'లో పడనే పడింది.

అతను గలగల నాదం చేశాడు.

"పులి లేడిని తింటాది! అదేటది? పులిని పులి తింటే గొప్ప. అందుకే మనం....మనుషుల్నే తింటాం! తప్పదియ్యి! గుంటని కైమా జేసిదినాల!" అతన్ని మందలించేపాటి సాహసం లేని అతని అనుచరులకి - అతన్ని రెచ్చగొట్టి మంచిచేసుకునేపాటి అవసరాలున్నాయి. అలా రెచ్చగొట్టబడిన ఆ పెద్దమనిషి -

"ఎవుర్ని ఎక్కడకొట్టాలో అక్కడే కొట్టాల. ఎవుర్ని ఎలా వంచాలో అలాగే వంచాల. ఎవుర్ని ఏఁవెట్టుకుని పొడాలో అదెట్టుకునే పొడాల - అంది పూర్వం మాట. ఎఱ్ఱిబాగుల మాట. యిప్పుడు ఎవుర్నయినా కొట్టాలన్నా, వంచాలన్నా, పొడాలన్నా ఒక్కటే కావాల-! పింగు"

అతను చాలా దర్జాగా గుఱ్ఱాజు కూతురుకు కబురంపాడు.

"నీ బాబు పెళ్లిచెయ్యలేడు. చేసినా ఏ పెంటయ్యకో చేస్తాడు. నువ్వు కొత్తబట్టలు కట్టలేవు. నగలెట్టలేవు. కట్టినా చెత్తరకాలు కడతావు. యెట్టినా గిల్టునగలెడతావు. టాక్సీమీదవచ్చిన సంబంధం ఎప్పుడో చెక్కేసింది. కనీసం గాడిదమీద కూడా ఏ సంబంధమూ రాదు" అంటూ ఆమె స్థితిని ఓ ఆడదాని ద్వారా చెప్పించాడు.

"నువ్వా-పిటపిటలాడిపోతున్నావు రోడ్డు మీదకొచ్చావా - ఊరి సూపంతా నీమీదే! నీకా - రోడ్డు మీదకి రాక తప్పదు. నలుగురి కంటా పడకతప్పదు. నువ్వా నలుగుర్నీ సూడకా తప్పదు. ఎప్పుడో ఎవురికో లొంగకా తప్పదు. వయసలాటిది. ఆ తర్వాత ఏటవుద్ది" అంటూ భవిష్యత్తును సూచించాడు.

"అందుకని నా మాట యిను! నన్ను నమ్ముకో! నేను సేరదీస్తానంటే వరసగట్టేవాళ్ళు కో అంటే కోటిమంది. నీ సక్కదనంకన్నా నిన్ను చూస్తే జాలే యేస్తంది" అంటూ చెప్పించాడు.

"పట్నంలో కాపరం యెడతాను. సీరలు కొంటాను. నగలెడతాను. దొరసాన్లాగుంటావు. రాజా బతుకు బతుకుతావు. రాత్రికి రాత్రి ఊరు దాటించేస్తాను. వచ్చెయ్!" అని గీతోపదేశం చేయించాడు.

ఆ పిల్ల ఆ మాటలని మొదట్లో వినటానికి భయపడింది. విన్నందుకూ వింటున్నందుకూ దుఃఖించింది. తన బ్రతుకులోకి సుఖం నిజంగానే రాదా-అని ఆలోచించింది. అలా ఆలోచించాక అతని సలహా గూర్చి కొంత సానుభూతిగా ఫీలయింది. ఆ ఫీలింగ్ కలిగిన వెంటనే యింటికి పరుగెత్తుకొచ్చింది. అక్క ప్రవర్తనలో కొత్తరకం బెరుకు గమనించిన చెల్లెలు నిలదీయటంతో బావురుమంది. తల్లి కలగజేసుకొని గొంతు విప్పగానే ఆ పిల్ల తను చాలా పెద్దపాపం చేసాననుకొంది. నూతికి పరుగెత్తింది. ఆమె యత్నం ఫలించలేదు తండ్రికి కబురు వెళ్ళింది.

"నువ్వేమో పెద్దకాపువి! నీకు పయి పయి నాపసాన్లు ఊడిగాలు సేస్తారు. నువ్వు ఆళ్ళని దీస్తావు. నానులేస్తావు! పట్టెళ్ళేస్తావు! నీ కూతురు - నువ్వు సొంతంగా కన్నకూతురు బజారుదవుద్ది! పయోళ్ళకి సానవుద్ది" అంటూ ముగించింది.

గుర్రాజు కోపంతో ఊగిపోయాడు. 'నరికేస్తా' 'పాడిచేస్తా' నంటూ రంకెలేసాడు. 'నా కులవేఁటి? నా బలగవేఁటి? నా వోళ్ళంతా గలిసి ఒక్కసుట్టు ఉమ్మితే ఆడూ ఆడి నడమంత్రం యేపారం ఎక్కడుంటాది?" అన్నాడు.

"నువ్వు ఎగిరితే సాల్దు. నీకు తమ్ముడున్నాడు. ఓ మాట అతని సెవిని యెయ్యి. పదిమందినీ కూడదీస్తాడు" అంటూ గుర్రాజుకి నచ్చచెప్పి మరిది యింటికి పంపింది.

కళ్ళు నులుముకుంటూ వచ్చి తలుపు తీశాడు తమ్ముడు. రక్తం పంచుకు పుట్టిన తమ్ముడు. తండ్రిపోయాక తన చేతుల్లో పెరిగిన తమ్ముడు తనవాడు. తనకి మంచీ చెడ్డా చెప్పేవాడు. తన కష్టం సుఖం పంచుకొనేవాడు - గుర్రాజు మనసు చలించిపోయింది. జరిగినదంతా చెప్పటానికి నాలుగువాక్యాలు పట్టలేదు.

"తప్పేమరి! ఆడు అలా సెయ్యకూడదు." అనే అన్నాడు అతను. ఆ గొంతు గుర్రాజు ఆశించినట్టులేదు. అయినా తన ధోరణిలోనే అన్నాడు.

"అలాగంటప్పుడు మనం ఊరుకొంటే ఎలా? మన వోళ్ళని కూడ గట్టాల! ఆడి తోలుదియ్యాల!"

"అవునవును!"

"మనోళ్ళకి ఎప్పుడు కవురంపాలో ఏటో సూడు!"

"నేనా! పెద్దోడివి నువ్వు?"

గుర్రాజు కొంచెం నసుగుతూ- "నేను కవురంపడంకన్నా నువ్వు కవురంపితేనే మనోళ్ళు కూడతారు!"

"ఎందుకనీ....?"

గుర్రాజు జవాబివ్వలేకపోయాడు. తమ్ముడు కాస్సేపు చుట్ట పీల్చి - "ఓ మాట! దివాణమే యిలా కవురంపిదనుకో! అప్పుడూ?"

"సచ్చినా- ఆళ్ళలా సెయ్యరు! ఆళ్ళకి ఎవుర్ని ఎలాసూడాలో, ఎవురి విలవ ఎలాఁటిదో తెలుసు!"

"యిది మనం యిన్నదీ, సూసిందీ. మన దివాణంలో మన ఎరికలో యిలాంటియ్యి జరిగుండకపోవచ్చు. ఎక్కడా జరగవా?"

అయోమయంగా చూశాడు గుర్రాజు.

"ఆళ్ళమాట జరిగేది. ఆ రోజులు అయ్యి."

"దివాణానికీ యాడికీ పూటా యెడతన్నావా?"

"ఏటి తేడ? ఆళ్ళకాడా డబ్బుండేది! యీడికాడ డబ్బుంది."

గుర్రాజు తేరుకుంటూ-

"అయితే ఆ జాత్తక్కవ యెధవని యెనకేసుకొచ్చి నువ్వు సెప్పేదేట్రా?"

"నేను ఎనకేసుకురాటంలేదు. అదా వయసులో ఉంది. నువ్వా పెళ్ళి సెయ్యలేవు. యీడుగాపోతే మరోడు పిలుస్తాడు. మనం పంపలేమా - మనపిల్ల గుమ్మం దాటకుండా సూసుకోవాల. ఊరోళ్ళమీద కలబడితే ఊరుకుంటారేటి?"

"ఒరే .... ఒరే.... తమ్ముడూ! నేను పెద్దోణ్ణి! పెద్దబతుకు బతికినోణ్ణి! నువ్వు తమ్ముడివి! సాయానా తమ్ముడివి! యిది....యిదిట్రా నువ్వు సెప్పేది..."

"సెడి బతకడం.... బతికి సెడ్డం అని రెండు లేవు! సెడకుండా పయికొచ్చినోడూ....పయికొచ్చాకయినా సెడకుండా ఉన్నోడూ.... యిప్పుడు ఒక్కడంటే ఒక్కడుండడు! ఆడిని జాత్తక్కవాడంటన్నావు. నాకు తెలకడుగుతాను- జాతి ఎక్కువయినోడు అడిగితే పంపుతావేటి? ఎవుడికాడ డబ్బులుంటే ఆడి జాతే ఎక్కువ. మడుసులకి మూడు గుణాలంట - రజోగుణం, తమోగుణం, సత్వగుణం. మనిషికి తామసం పనికిరాదు. గాంధీగారు ఏటన్నారు? అందరిదీ ఒకటే రక్తం అన్నారు. కృష్ణుడేటన్నాడు? ఎవురి డ్యూటీ ఆరు తెల్సుకోవాలన్నాడు. ఆడి డ్యూటీ ప్రకారం ఆడు కవురంపాడు నువ్వూ ఆడిలా వుంటే కవురంపుతాడా? పంపడు. అందుకని నీ డ్యూటీ నువ్వు తెల్సుకోవాల! నువ్వు ఆడితో కలబడగలవా? కలబడలేవు. ఆడి మాట వొప్పుకోగలవా? ఒప్పుకోలేవు! నువ్వొక్కడివీ ఏం చెయ్యగలవు! నీ డ్యూటీ యేటి! ఆలోసించుకో! నా డ్యూటీ నేను ఆలోసించుకున్నాను. నా కూట్లో నేను బుగ్గిపోసుకోలేను...."

గుర్రాజు బయటకు వచ్చిన వెంటనే ఆ తలుపులు మూసుకున్నాయి. ఆ చీకటి రాత్రి అతనా యింటివేపు చూస్తూనిలబడిపోయాడు. అది తాము ఇద్దరూ పుట్టిపెరిగిన ఇల్లు. ఇప్పుడది తనది కాదు. ఆ యింటికి ఎన్నో మార్పులు. అది మేడయింది. చాలా ఎత్తుగా వుంది. ఆ ఇంట్లో తనదంటూ ఏమీ లేదు. ఏ ఆసరా లేదు. ఇసక కాంట్రాక్టుల్నించి రిపేరింగ్ కాంట్రాక్టులకీ, ఖాయిదా పాటల్నించి కమీషన్ వ్యాపారానికీ ఎదుగుతున్న సోమరాజు ఆ యింట్లో ఉన్నాడు. అలా ఎదుగుతున్న మనుషులకి ఎదిగేసిన మనుషులతో ఎన్నో అవసరాలుంటాయి. అన్నగారే అయినా, దిగిపోయిన మనుషులతో ఏ అవసరాలూ వుండవు.

అలసటతో దుఃఖంతో దెబ్బతిన్న మనసుతో ఇల్లుచేరాడు గుర్రాజు. ఎదురుచూస్తున్నాడు కొడుకు. ఏదో ఆధారంకోసం అతని మనసు ఆరాటపడింది. కొడుకుని దగ్గరగా తీసుకున్నాడు.

"ఏటన్నాడు సిన్నాన్న?"

జవాబివ్వలేదు గుర్రాజు. అతన్ని కప్పివున్న ముసుగు కొంచెం సడలినట్లయింది. ఈ చుట్టూ వున్న మనుషుల్లో-లేనివాళ్ళూ, ఉన్నవాళ్ళూ- రెండే

రకాలున్నట్టు అర్థమయినట్లయింది. మూడో రకం ఉన్నా-వాళ్ల ఉన్నోళ్ళయినా అవుతున్నారు, లేనోళ్ళయినా అవుతున్నారు. తమ్ముడు తనూ..... ఉన్నారు. ఒకడు ఉన్నోడు. ఇంకోడు.... అవును! లేనోడు. ఉన్నోడు తోటివాళ్లను సమర్థించాడు లేనోడు? లేకపోయినందుక్కూడా గుర్రాజు ఎప్పుడూ అంత బాధ పడలేదు. ఉన్నోడు తన తోటివాళ్ళతో ఎంత వేగం కలిసిపోయాడు! తను కలియలేకపోయాడు! లేనోళ్ళతో కలియలేకపోయాడు. వాళ్ళలా పారపట్ట లేకపోయాడు. నిజానికి తనకులంలో లేనివాళ్ళు ఎంతమందిలేరు? వాళ్లని తను - కలిగినప్పుడు సరే- లేనప్పుడయినా గౌరవించాడా? తనూ గొప్పవాడిలాగే తిరిగాడు. ఈ కులాలు ఎవరికి? ఉన్నోళ్ళకి! తమ కింద స్థితిలో ఉన్నవాళ్ళని మరింత విడదీసి తాము మరింత మీదకు పోయేందుకు సాధనాలవి.

కొడుకు నిద్రపోతున్నాడు. రాత్రంతా అతని మేధాశక్తి మేరకు అతని అనుభవాల మించి రకరకాల ఆలోచనలు వచ్చిపోతున్నాయి గుర్రాజుకి. తూర్పుదిక్కున, వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి. చితకగొట్టేసినట్టు పడుకున్న ఆ యింట్లో మనుషులు ఒకరూ ఒకరూ మేలుకొంటున్నారు.

గుర్రాజు చూపులు అకస్మాత్తుగా గోడమీద ఉన్న గుర్రపుకళ్లెంమీదకూ జీను మీదకూ పోయాయి.

అతను పిచ్చిపట్టినట్టు లేచాడు.

ఆ వస్తువులను విసిరేసాడు. సాలలో గుర్రప్పిల్లలను విప్పి వదిలేసాడు.

కొడుకు గబుక్కున పరుగెత్తుకు వచ్చాడు.

"ఏటి బాబా?" తన తాతతండ్రుల ఉపదేశాలు తను కొడుక్కి యివ్వలేదు. ఏ గౌరవాలను నిలబెట్టమని తను చెప్పరాదో అతనికి తెలుస్తోంది. ఏ గౌరవాలను నిలబెట్టమని చెప్పాలో అతనికి అప్పటికి అర్థం కాలేదు. మనుషుల్ని మనుషులతో కలిపే సంప్రదాయాలేమిటో అతనికి అర్థంకాలేదు. అయినా అలా కలవాలిసిన అవసరంతో అతను కదిలిపోతూ కొడుకు చేయి గట్టిగా పట్టుకున్నాడు.

ఆ తరం ఓ అడుగు వేయగలిగితే తరువాతి తరం మరో అడుగు వేయకపోదు.

సాహసానికి చిహ్నంగా ఉండే తను విలాసానికి చిహ్నమయి వీధిలోకి విసిరివేయబడినందుకు వెర్రిగా చూస్తూ ఉండిపోయింది మురికి కాలవలో గుర్రపు కళ్ళెం!

('స్వాతి' మాసపత్రిక - జనవరి, 1983)